క్లుప్తంగా

సీడబ్ల్యూసీ గంగవరం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా కంబాల



నల్లారావును సత్కరిస్తున్న పీపీఎం డిపార్ట్‌మెంట్ అధికారులు

పెదగంట్యాడ: తనపై నమ్మకంతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని కంబాల నల్లారావు అన్నారు. ప్రతిష్టాత్మకమైన స్టీల్‌ప్లాంట్ సీడబ్ల్యూసీ గంగవరం కమిటీ నూతన సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కంబాల నల్లారావును స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నియమించింది. ఈ మేరకు ఆయనను పీపీఎం డిపార్ట్‌మెంట్ అధికారులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణన్, వినోద్‌కుమార్, సత్యనారాయణ, బీఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలి దృష్టికి సమస్యలు



కమలమ్మతో అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలు పి.ఎం.కమలమ్మను భెల్ (హెచ్‌పీవీపీ) నాయకులు విమానాశ్రయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భెల్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి కొల్లి దేముడు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై భెల్ యాజమాన్యాన్ని కలిసి మాట్లాడతామని ఆమె తెలియజేశారన్నారు. ఆమెను కలిసిన వారిలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు పి.ప్రభాకర్, బీఈఆర్‌పీటీయూ అధ్యక్షుడు ఎం.ముసిలిరెడ్డి, కరణం దేముడు, బి.రాజ్ కుమార్, డి.సాయిబాబు తదితరులున్నారు.

సంకట మోచన గణపతి ఆలయ వార్షికోత్సవం రేపు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి గరిక, జిల్లేడు, బిల్వపత్రాలతో అర్చన చేస్తామని, ఆలయంలో గణపతి, లక్ష్మీ గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్వామి కల్యాణం జరిపిస్తామని తెలియజేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రజా గర్జనకు ఎంపీకి ఆహ్వానం

ఉక్కునగరం: ప్రజాగర్జనకు హాజరు కావాలని శ్రీకాకుళం ఎంపీ కె. రామ్మోహన్ నాయుడును ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆహ్వానించారు. ఎంపీని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కలిసి, ఆహ్వానపత్రం అందజేశారు.

'బొమ్మలను కాదు.. భూములను పంచండి'

గాజువాక: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న పిల్లలకు బొమ్మలను పంచడం కాకుండా దున్నేవాడికి భూమిని పంచాలని దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ పిల్లలకు బొమ్మలను కొనిచ్చే స్థాయికి వారి తల్లిదండ్రులను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం వారు వ్యక్తిగత ఆస్తిని పొందే విధంగా అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రధాన ఉత్పత్తి కారకమైన భూమిని దున్ని పండించగలిగిన రైతుకు అందించగలిగితే వారు పేదరికం నుంచి బయటపడతారన్నారు. వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే ఆత్మహత్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. బీజేపీ పాలకులు బొమ్మలను కాకుండా భూమిని పంచాలని, ఆలయాలకు బదులు విద్యాలయాలను నిర్మించాలని, ప్రజలకు కూడు, గూడుతో పాటు శాస్త్రీయ విద్యనందించాలని కోరారు.

'ఉక్కు'ను ధారాదత్తం చేస్తే సహించం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- నిర్వాసిత కాలనీల్లో మహా పాదయాత్ర
- ప్రజాగర్జన విజయవంతానికి పిలుపు



పెదగంట్యాడ జంక్షన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తే సహించబోమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హెచ్చరించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని నిర్వాసిత కాలనీల్లో మంగళవారం మహాపాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసి ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేయడం సరికాదన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రతీ గ్రామం స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉందని, లక్షలాదిమంది బతుకులు ఉక్కు పరిశ్రమతో ముడిపడి ఉన్నాయని అన్నారు. అటువంటి పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెబితే వారంతా ఏం కావాలని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతోమంది భూములు కోల్పోయారని, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దిగి వచ్చేలా ఉక్కు గర్జనను విజయవంతం చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, రాజాన వెంకటరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గంట్యాడ గురుమూర్తి, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, అనిపెద్ది మసేనురావు, దొమ్మేటి అప్పారావు, డి.వి. రమణారెడ్డి, ఎల్లేటి శ్రీనివాసరావు, నందికి తాతారావు, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవిత కోసం..

- సీఎం జగన్ తపన
- పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 65వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: భావితరాల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. విద్యార్థులకు చక్కని విద్య, సదుపాయాలను కల్పించారన్నారు. జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అందరికీ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఘనత దేశమంతా చెప్పుకొనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో హామీలే తప్ప పథకాల అమలు ఎక్కడా కనిపించలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్లలో నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం తపిస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ఎల్.వి.రమణ, పెంట్ర రాజు, సలపల స్వాతి, మద్దాల అప్పారావు, లోకనాథం, ఇరోతి గణేష్, మంగునాయుడు, దేముడు, జుత్తు లక్ష్మి, సుందరరావు, రాంబాబు, నారాయణమూర్తి, మంత్రి మంజుల, పుష్ప, రమణ, అర్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు వినతి



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు జ్ఞాపిక అందజేస్తున్న విజయలక్ష్మి

మహారాణిపేట: గాజువాకలో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలం గానీ, వ్యాపార సముదాయ భవనం గానీ కేటాయించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు. విస్తరిస్తున్న విశాఖలో మరో లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ డైరెక్టర్ పైడి రమణ, విశాఖ లేపాక్షి మేనేజర్ విజయ గౌరి, సిబ్బంది దయానంద తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన



పారిశుద్ధ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు

పెదగంట్యాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా, తల్లిదండ్రులకు సూచించాలని కోరారు. తడి–పొడి చెత్తను వేర్వేరుగా శానిటరీ సిబ్బందికి ఇచ్చేలా చూడాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు విద్యార్థులు సహకారం అందించాలని కోరారు. అనంతరం పాఠశాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి, శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రపాణి, ఆత్మకూరి రవి తదితరులు కల్యాణం జరిపారు.

29న సివిల్స్ శిక్షణకు టాలెంట్ టెస్ట్

బీచ్ రోడ్డు: సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 29న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు తక్షశిల ఐఏఎస్ అకాడమీ నిర్వాహకులు జి.సాయిరాం తెలిపారు. మంగళవారం టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఈ పరీక్షను సంపత్ వినాయక ఆలయం వెనకవైపు ఉన్న తమ సంస్థలో నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 99652 52252 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

యువతి చికిత్స కోసం పోలీసుల రక్తదానం



రక్తం ఇస్తున్న మహిళా పోలీస్ దివ్యవాణి

ఆరిలోవ: అత్యవసర పరిస్థితిలో ఓ యువతికి రక్తం అందించిన నగర పోలీసులు ఔదార్యం చాటుకున్నారు. అనకాపల్లి జిల్లా మెల్లిపాక గ్రామానికి చెందిన సీహెచ్. సాయి అనే 19 ఏళ్ల యువతి అప్లాస్టిక్ అనీమియా అనే సమస్యతో బాధపడుతోంది. ఆమె తల్లిదండ్రులు వైద్యం కోసం ఆరిలోవ హెల్త్ సిటీలో పినాకిల్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె చికిత్సకు రక్తం అవసరమని వైద్యులు తెలపడంతో విషయం తెలుసుకున్న నగర పోలీసులు రక్తదానానికి ముందుకొచ్చారు. సైబర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు జి.సత్యనారాయణ, కె.నాగేశ్వరరావు, కె.దివ్యవాణితో పాటు విశ్రాంత హెచ్‌సీ జె.శ్రీనివాసరావు రక్తదానం చేసి ఆ యువతికి అందించారు. యువతి తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజుకు ఎన్ఎంయూ కార్మికుల రిలే దీక్షలు



స్టీల్‌సిటీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌సిటీ డిపోలో కార్మికులపై యాజమాన్యం అవలంబిస్తున్న విధానాలను విడనాడాలని ఎన్ఎంయూ కార్మికులు డిమాండ్ చేశారు. రెండో రోజు రిలే నిరాహారదీక్షలను కొనసాగించారు. దీక్షా శిబిరంలో కృపాకరం, జె.ఎన్.రావు, ఎమ్.ఎస్.వాసు, కె.ఎన్.రాజు, పి.రమణ కూర్చొన్నారు. జోనల్ చైర్మన్ సూర్యం, రీజనల్ చైర్మన్ ప్రాంఛ్, సీసీఎస్ డెలిగేట్ ఎస్.వి.రమణ దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వంపై కార్మికులు తిరగబడే విధంగా స్టీల్‌సిటీ డీఎం, అసిస్టెంట్ డిపో మేనేజర్ వేధింపులకు పాల్పడడం తగదన్నారు. డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను విడనాడి, సీనియారిటీ ప్రకారం చార్టులు వేసే విధానాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో సాయిరాం, సూర్యం, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతీ ఇంటా సంక్షేమం



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: నవరత్నాలతో ప్రతీ ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరువవుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలతో పాటు ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా సుదూర ప్రాంతంలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, నేడు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటకు చేర్చడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోడానికి ప్రజలు సన్నద్ధులై ఉన్నారన్నారు. అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సత్వరం పరిష్కరిస్తున్నామన్నారు. స్థానికులు రోడ్డు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. లంకెలపాలెం రామాలయం వీధి, దాసరిపేట, కర్ణంకోటి వీధి, ఆర్‌కె టౌన్‌షిప్, సంపత్‌నగర్‌ల్లో కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, జి.పూర్ణానందశర్మ, సుందరపు అప్పారావు కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, యలమర్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై తోపుడు బళ్లను తొలగిస్తున్న ట్రాఫిక్, టౌన్‌ప్లానింగ్ అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ కార్యదర్శులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి ఎల్జీ పాలిమర్స్ జంక్షన్ వరకు ఈ డ్రైవ్ చేపట్టారు. రోడ్డుపై, ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దుకాణాలు ఇబ్బందిగా తయారవుతున్నాయని తెలిపారు. సీఐ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 91, 92 టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు దామోదర్, పాత్రుడు, బాలాజీ, రాజేష్, ఆదిత్య, ఈశ్వర్, సత్యనారాయణ, సుశీల, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధం



712వ రోజు దీక్షశిబిరంలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లేకుంటే పోరాటాల ద్వారా కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 712వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, విల్లా రామ్మోహనకుమార్, యు.రామస్వామి, ఎన్.రామారావు, సీహెచ్.సన్యాసిరావు ప్రసంగించారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమను అమ్మే హక్కు లేదన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనలో కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు ఆర్.వెంకటరావు, డి.శ్రీనివాస్, రవికుమార్, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

వాడవాడలా అవగాహన ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న విజ్ఞాన్స్ హైస్కూల్ చిన్నారులు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గాజువాక: జాతీయ బాలికా దినోత్సవాన్ని గాజువాక ప్రాంతంలోని వివిధ విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బాలికల ఔన్నత్యాన్ని పాటలు, ప్లకార్డుల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని తనకు తాను నిరూపించుకోవడం కోసం ఉన్నత విద్యనభ్యసించి, సమాజంలో ఆదర్శవంతమైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- జోగవానిపాలెంలోని విజ్ఞాన్స్ హైస్కూల్‌లో బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికలు, మహిళల పరిరక్షణను ఉద్దేశించి కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉంటూ ఉన్నత చదువులనభ్యసించాలని పాఠశాల ప్రిన్సిపాల్ కౌశర్ పర్వీన్ ఈ సందర్భంగా కోరారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తున్న మణిమాల

సింహాచలం: కంటి సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ అండ్ గ్రూప్ సీఈవో కేబీఎన్ మణిమాల సూచించారు. ఎన్ఏడీ కొత్తరోడ్డులోని భాష్యం స్కూల్, గోపాలపట్నంలోని ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులకు శంకర్ ఫౌండేషన్‌లో మంగళవారం కంటి సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రియాల్లో అధిక ప్రాధాన్యం కంటికి ఉందన్నారు. ప్రపంచాన్ని మనకు చూపించేది కన్ను మాత్రమే అని తెలియజేశారు. కళ్లు లేకపోతే జీవితమంతా అంధకారమే అన్నారు. నేటి విద్యార్థులు కంప్యూటర్స్, స్మార్ట్ ఫోన్స్ వినియోగంలోనే ఎక్కువ సమయం గడపడంతో దృష్టి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఆదిలోనే దృష్టి సమస్యలను గుర్తిస్తే చిన్నపాటి వైద్యంతోనే నయం చేసుకోవచ్చన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ సుపర్ణ, డాక్టర్ సౌమ్య కంటి వైద్యంలో వినియోగిస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని, శస్త్ర చికిత్సల్లో వినియోగిస్తున్న నూతన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్లు కె.ఎస్.వినోద్, సుభాషిణి, శ్రీధర్ పాల్గొన్నారు. అంతకముందు కంటి ఆరోగ్యంపై గోపాలపట్నం నుంచి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్‌కు ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చారు.

ఏయూ సమాచారం..

తెలుగు విభాగం సందర్శన



తెలుగు విభాగం వద్ద డాక్టర్ లక్ష్మీపార్వతి, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని మంగళవారం తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి సందర్శించారు. ఆమెతో పాటు రెక్టార్ ఆచార్య కె.సమత పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో మమేకమయ్యారు. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత, సంస్కృతి సంప్రదాయాలను రక్షించవలసిన ఆవశ్యకతను లక్ష్మీపార్వతి వివరించారు. విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయస్సులో తప్పటడుగులు వేయటానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, అందుకోసం మనస్సు సాహిత్యం వైపు మరల్చి చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, తెలుగు ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), బోధనేతర సిబ్బంది, పరిశోధక, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచార్య వెంకటేశ్వర్లుకు ఘన నివాళి



సంస్మరణ సభలో పాల్గొన్న వక్తలు

ఏయూ క్యాంపస్: అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య వెంకటేశ్వర్లు సంస్మరణ సభ మంగళవారం తత్వశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎస్.చలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆచార్య వెంకటేశ్వర్లు చేసిన కృషిని వివరించారు.

మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఆచార్య వెంకటేశ్వర్లుతో తనకున్న అరవయ్యేళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ సిమ్మన్న, ఆచార్య చందు సుబ్బారావు, డాక్టర్ నటరాజ్, డాక్టర్ కె.వి.ఎస్.కొచ్చెర్లకోట, వర్మ, తత్వశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.